
2లో.

## నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -94 బుధవారం 18 జూన్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# 600 ఫోన్ల ట్యాప్

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు

- నక్సల్స్ సానుభూతిపరుల పేరుతో ట్యాప్
- జాబితాలో రేవంత్, ఈటెల, అరవింద్ , రఘునందన్ రావు
- మరోమారు విచారణకు హాజరైన ప్రభాకర్ రావు



హైదరాబాద్,**జూన్17(జర్నలిస్ట్ వార్త):** ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్న తరుణంలో ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు మరోసారి సిట్ విచారణకు హాజరయ్యారు. నాలుగో సారి సిట్ ముందు హాజరైన ఆయనను మరింత లోతుగా విచారించేందుకు సిట్ ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటికే 600 మంది ఫోన్ ట్యాపింగ్ బాధితుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌తో వారు ఇబ్బందులకు గురైన తీరును వివరించి.. దానిపై ప్రభాకర్‌రావు ఏం చెబుతారనే విషయాన్ని నమోదు చేయనున్నట్లు సమాచారం. మిగతాది 2లో...

# ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ముదురుతున్న ఘర్షణ



- ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్ ప్రధాన కార్యాలయంపై ఇరాన్ బాంబు దాడి
- గ్లిలాట్‌లోని ఇజ్రాయెల్ సైనిక ఇంటెలిజెన్స్ కాంప్లెక్స్‌పైనా క్షిపణి ప్రయోగం
- మధ్యవర్తుల ద్వారా చర్చలకు సిద్ధమంటూనే దాడులు కొనసాగిస్తున్న ఇరాన్
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కెనడా పర్యటన అర్ధాంతరంగా ముగింపు



వాషింగ్టన్: **జూన్17(జర్నలిస్ట్ వార్త):**
ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య మొదలైన ఘర్షణలు ఐదోరోజుకు చేరుకోవడంతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారం హుటా హుటిన కెనడా నుంచి వాషింగ్టన్ తిరిగి వచ్చారు. జీ-7 సదస్సుకు హాజర య్యేందుకు కెనడా వెళ్లిన ట్రంప్ తన పర్యటనను కుదించుకొని ఒక రోజు ముందే స్వదేశానికి చేరుకున్నారు. మిగతాది 2లో...



# ఫోన్ ఇవ్వాల్సిన అవసరం లేదు

**కెటిఆర్‌కు న్యాయవాదుల సలహా**

**కోర్టు తీర్పు లేకుండా విచారణకు వ్యక్తిగత ఫోన్లు ఇవ్వాల్సినఅవసరం లేదని స్పష్టీకరణ**

**ఈకార్ రేసు ప్రభుత్వంనిర్వహించిన కార్యక్రమం**

**ఫోన్లు అడిగే హక్కు ఎసిబికి లేదని తేల్చిన లాయర్లు**

హైదరాబాద్:**జూన్17(జర్నలిస్ట్ వార్త):**
ఫార్ములా ఈ విచారణ సందర్భంగా ఎసి బికి కెటిఆర్ మొబైల్ ఫోన్లతో పాటు ల్యాప్‌టాప్ ఇవ్వాలన్న అంశంపై ఆయ న న్యాయవాదులతో కలిసి చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ప్రస్తుతం న డుస్తున్న విచారణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో నిర్వహించిన క్రీడా కార్యక్ర మానికి సంబంధించినదని, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తర్వాత రేసు నిర్వహణ పూర్తిగా అధికార యంత్రాంగం ద్వారా సాగిందని కెటిఆర్ న్యాయవాదులు ప్రాథమికంగా పేర్కొన్నారు. మిగతాది 2లో...

## గోదావరి-బనకచర్ల వివాదం

# నేడు అఖిలపక్షం

**కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు గౌరవ అతిథులుగా ఆహ్వానం**

**కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ ఎంపీలందరికీ లేఖలు, ఫోన్లు చేసిన ప్రభుత్వం**

**ఏపీ ప్రాజెక్టు తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీస్తుందని మంత్రి ఉత్తమ్ ఆందోళన**



హైదరాబాద్**జూన్17(జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై అనుసరించాల్సిన తదుపరి వ్యూహంపై చర్చించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశం నేడు సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. మిగతాది 2లో...

# గోదావరి మిగులు జలాలతో బనకచర్ల



## ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదు: రామానాయుడు

సముద్రంలో కలిసే నీటినే వినియోగించేలా ప్లాన్

2లో

# మూడెకరాల రైతులకు తొలుత రైతుభరోసా

**1,551.89 కోట్ల రూపాయలను విడుదల చేశాం: తుమ్మల**

ఖమ్మం,**జూన్17(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్రంలో మూడు ఎకరాల వరకు భూమి ఉన్న అన్నదాతలకు రైతు భరోసా నిధులను ప్రభుత్వం జమ చేసింది. మంగళవారం 1,551.89 కోట్ల రూపాయలను విడుదల అయ్యాయి. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ రోజు 3 ఎకరాల వరకు భూమిని కలిగి ఉన్న రైతులందరి ఖాతాలలోకి ఎకరానికి 6 వేల చొప్పున రైతు భరోసా నిధుల జమ చేయడం జరిగిందని వెల్లడించారు. అయితే, అందుకోసం 1551.89 కోట్ల రూపాయలను విడుదల చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 10.45 లక్షల మంది రైతులకు సంబంధించిన 25.86 లక్షల ఎకరాలకు రైతు భరోసా నిధులు జమ చేశాం అన్నారు. ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన వారందరికి రైతు భరోసా నిధులు జమ చేస్తామని ప్రకటించారు.



## ప్రజా ప్రభుత్వంలో సంక్షేమాన్ని

# వెనకబడనివ్వం.. అభివృద్ధిని ఆగనివ్వం


3లో

# నాలుగుచోట్ల ఆధునికగోశాలలు

**వేములవాడ, యాదగిరిగుట్ట, ఎనికేపల్లి, పశు సంవర్ధక వర్శిటీలో అత్యాధునిక గోశాలల నిర్మాణం**

**గోరక్షణకు సమగ్ర పాలసీ**

**అధ్యయనానికి ముగ్గురు అధికారులతో కమిటీ**

**కమిటీ సభ్యులుగా సబ్యసాచి ఘోష్, శైలజారామయ్యర్, రఘునందన్‌రావు**

**సమీక్షాసమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి**


2లో

# 600 ఫోన్ల ట్యాప్

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్రమంలో తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సాధారణ ఎన్నికల సమయంలో నవంబర్ 15న పెద్ద ఎత్తున ట్యాపింగ్ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నవంబర్ 15న 600 మంది ఫోన్లను ప్రభాకర్ రావు టీమ్ ట్యాప్ చేసినట్లు గుర్తించారు. సాధారణ ఎన్నికల సమయంలో ప్రణీత అండ్ టీమ్ పెద్ద ఎత్తున ట్యాపింగ్‌కు పాల్పడినట్లు బయటపడింది. ఒకే రోజు 600 ఫోన్‌లను ప్రభాకర్ రావు ట్యాప్ చేశారు. మావోయిస్టుల పేరు చెప్పి ట్యాపింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మావోయిస్టులకు సహకారం అందిస్తున్నారని మావోయిస్టుల సానుభూతిపరుల పేర్లతో ట్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. రివ్యూ కమిటీకి మావోయిస్టుల పేర్ల మీద నెంబర్లను ప్రభాకర్ రావు ఇచ్చినట్లు తేలింది. సాధారణ ఎన్నికల్లో మావోయిస్టులు యాక్టివ్ అయ్యారని కమిటీకి ప్రభాకర్ రావు చెప్పినట్లు సమాచారం. మావోయిస్టుల పేరుతో అధికార, ప్రతిపక్ష, వ్యాపార రంగానికి చెందిన వారితో పాటు జర్నలిస్టుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. ప్రతిపక్ష కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పాటు కీలక నాయకుల ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయి. రేవంత్ రెడ్డి, ఈటెల రాజేందర్, అరవింద్ , రఘునందన్ రావు ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు గుర్తించారు. అప్పటి బీఆర్ఎస్ అధికారపక్ష నాయకులు, ఎమ్మెల్యేల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారు. ట్యాపింగ్ కోసం ప్రభాకర్ రావు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. శ్రవణ్ రావు ద్వారా సమాచారం తెప్పించుకొని ప్రణీతరావుకు ప్రభాకర్ రావు ఇచ్చేవారని తేలింది. ట్యాపింగ్ ద్వారా వచ్చిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు భుజంగరావుకు ప్రణీత్ ఇచ్చారని... భుజంగరావు నేరుగా బీఆర్ఎస్ నేతలకు ఫోన్ చేసి స్థితిగతులను ఎప్పటికప్పుడు వివరించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రతిపక్ష నాయకుల వైపు ఎవరైనా వెళ్తుంటే వెంటనే అధికారపక్ష నేతలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు భుజంగరావు. ప్రతిపక్ష పార్టీలకు ఆర్థిక సాయం చేస్తున్న వారిపై నిఘా పెట్టి పోలీసులతో దాడులు చేయించారు. వ్యాపారవేత్తలపై దాడుల కోసం టాస్క్ ఫోర్స్ ఓఎస్డీ రాధా కిషన్ రావును ప్రభాకర్ రావు ఉపయోగించుకున్నట్లు సమాచారం. డబ్బులు ఎవరైనా తీసుకువెళు తుంటే వెంటనే ట్యాప్ చేసి మరీ అధికారులు పట్టుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

### గోదావరి-బనకచర్ల వివాదం

# అన్ని పార్టీల ఎంపీలతో నేడు సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ కీలక భేటీకి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను గౌరవ అతిథులుగా ఆహ్వానించినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు ఆహ్వానాలు పంపామని, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల ఎంపీలకు వ్యక్తిగతంగా ఫోన్లు చేసి సమావేశానికి రావాల్సిందిగా కోరినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "ట్రైబ్యునల్ తీర్పులకు, చట్టాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి–బనకచర్ల ప్రాజెక్టును చేపట్టాలని చూస్తోంది. ఈ విషయంపై మేము ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి మా అభ్యంతరాలను తెలియజేశాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేను కూడా కేంద్రానికి లేఖలు రాశాం. కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కూడా కలిసి ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణ ప్రజల నీటి హక్కులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వివరించాం" అని తెలిపారు.

ప్రస్తుతం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద ఉన్న గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీఫీజబిలిటీ నివేదికను తిరస్కరించాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. "ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుంది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకుగాను ఎంపీలందరి అభిప్రాయాలను తీసుకోవాలని నిర్ణయించాం. అందుకే ఈ సమావేశం ఏర్పాటు చేశాం" అని ఆయన స్పష్టం చేశారు.

# ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ముదురుతున్న ఘర్షణ

(మొదటి పేజీ తరువాయి)

'మధ్యప్రాచ్యంలో జరుగు తున్న పరిణామాల దృష్ట్యా ప్రపంచ నేతల సమావేశం నుంచి ట్రంప్ తిరిగి వచ్చారు' అని శ్వేతసౌధం తెలిపింది. అధ్యక్ష భవనంలోని సిట్యుయేషన్ గదిలో సిద్ధంగా ఉండాలని ట్రంప్ తన జాతీయ భద్రతా బృందాన్ని ఆదేశించారంటూ వార్తలు వచ్చాయి. సంక్షోభాల సమయంలో అమెరికా ఇంటెలిజెన్స్, జాతీయ భద్రతా బృందం ఈ గదిలో సమావేశమై నిర్ణయాలు తీసుకుంటుంది. 'కెనడా నుంచి నేను వాషింగ్టన్‌కు తిరిగి రావడానికి, కాల్పుల విరమణకు ఏం సంబంధం లేదు. దాని కంటే పెద్ద పనే ఉంది. వేచి చూడండి' అని ట్రంప్ విలేకరులను ఉరిస్తూ చెప్పారు. ఇదిలావుండగా కెనడాలో ట్రంప్ ఇరాన్ ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తూ రాజధాని టెహ్రాన్‌ను తక్షణమే ఖాళీ చేయాలని సూచించారు. అమెరికాతో అణు ఒప్పందంపై ఇరాన్ సంతకం చేసి ఉండాల్సిందని పునరుద్ఘాటించారు. ట్రంప్ తన సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెడుతూ 'అణు ఒప్పందంపై సంతకం చేయాలని నేను ఇరాన్‌కు చెప్పాను. వారు చేసి ఉండాల్సింది. కానీ చేయలేదు. సిగ్గుచేటు. ప్రాణనష్టం జరిగింది. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదు. అంతా అయిపోయిందని నేను అంటున్నాను. ప్రతి ఒక్కరూ టెహరాన్‌ను ఖాళీ చేయాలి' అని హెచ్చరించారు.

**కాల్పుల విరమణ ప్రతిపాదనకు 'నో'**

ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అవకాశాలను ట్రంప్ పరిశీలిస్తున్నారని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తెలిపారు. ముందుగా కాల్పుల విరమణ పాటించి, ఆ తర్వాత రెండు దేశాలు చర్చలు ప్రారంభించాలని ఆయన సూచించారు. అయితే కాల్పుల విరమణ ప్రతిపాదనను ట్రంప్ తోసిపుచ్చారు. మాక్రాన్‌పై ఆయన మండిపడుతూ 'నేను కాల్పుల విరమణ కోసం కృషి చేసేందుకే జీ-7 సదస్సును వీడి వాషింగ్టన్ డీసీ వెళ్లానని మాక్రాన్ పొరబాటుగా చెప్పారు. అది తప్పు. నేను వాషింగ్టన్ ఎందుకు వచ్చానో ఆయనకు తెలియదు' అని అన్నారు. కాగా ఇరాన్-ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను నివారించాలంటూ జీ-7 దేశాల అధినేతలు రూపొందించే ముసాయిదా ప్రకటనపై ట్రంప్ సంతకం చేయబోరని అమెరికా అధికారి ఒకరు సోమవారం నాడే చెప్పారు. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పటికీ టెహ్రాన్‌తో అణు ఒప్పందం కుదుర్చు కోవాలని ట్రంప్ భావిస్తున్నారని అమెరికా రక్షణ మంత్రి హెగ్‌సేథ్ తెలిపారు. మధ్యప్రాచ్యానికి అదనపు దళాలను తరలిస్తున్నామని ఆయన చెప్పారు. అమెరికా యుద్ధ విమాన వాహక నౌక యూఎస్ఎస్ నిమిట్జ్ సోమవారమే ఆగేయాసికాకు బయలు దేరింది. ఇజ్రాయిల్ సైనిక చర్యలో అమెరికా భాగస్వామి అవుతుందా కాదా అనే విషయంపై ట్రంప్ ఏమీ మాట్లాడడం లేదు.

# నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు

/హైదరాబాద్:**జూన్17(జర్నలిస్ట్ వార్త):**

నైరుతి రుతుపవనాలు వేగంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురువనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్ర వెల్లడించింది. బుధవారం రాష్ట్రంలో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రద్రా కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్క ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. దక్షిణ ఒడిశా వద్ద ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. హైదరాబాద్ సహ ఇతర జిల్లాల్లో సైతం మేఘావృతమైన వాతావరణం ఉంటుందని అధికారులు వెల్లడించారు.

# ఫోన్ ఇవ్వాల్సిన అవసరం లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఎసిబి ఆదేశాలపై మంగళ వారం కెటిఆర్ న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదులతో కెటిఆర్ ఫార్ములా ఈ కేసుకు సంబంధించిన న్యాయ పర మైన అంశాలను చర్చించారు. కెటిఆర్‌తో సమావేశం అనంతరం న్యాయ వాదులు ఫార్ములా ఈ కేసుకు సంబంధించిన అంశాలను వెల్లడించారు. ఫార్ములా ఈ వ్యవహారంలో కెటిఆర్ వ్యక్తిగతంగా పరిమిత పాత్ర మాత్రమే వహించారని న్యాయవాదులు తెలిపారు. ఫార్ములా ఈ కేసు అనేది ప్రభుత్వ లావాదేవీకి సంబంధించినదే తప్ప, వ్యక్తిగత సంభాషణకు సంబంధించి కాదు అని న్యాయవాదులు స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ అంశానికి సంబంధించిన అవగాహన ఒప్పందాలతో పాటు ఆయా సంస్థలతో జరిగిన ఒప్పందాలన్నీ ప్రభుత్వానికి అందుబాటులో ఉన్నాయని, జరిగిన ప్రతి నగదు లావాదేవీ అధికారికంగా బ్యాంకుల ద్వారా జరిగినప్పుడు, అప్పట్లో మంత్రిగా ఉన్న కెటిఆర్ వ్యక్తిగత సమాచారం అడిగే హక్కు ఎసిబికి లేదని చెప్పారు. ఇవన్నీ ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న సమయంలో కేవలం రాజకీయ వేధింపుల కోణంలో మొబైల్ ఫోన్ అడగడం వెనుక న్యాయసమ్మతమైన కారణాలు ఏమీ లేవు అని న్యాయవాదులు పేర్కొన్నారు.

కోర్టు తీర్పు లేకుండా వ్యక్తిగత ఫోన్లను ఇవ్వాల్సిన అవసరం లేదు

విచారణ సంస్థలు ఒక పౌరుడి నుండి సేకరించిన సమాచారాన్ని తిరిగి అదే పౌరునిపై వాడే కుట్ర చేయడం అన్యాయమని గతంలో హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చాయని న్యాయవాదులు గుర్తు చేశారు. పైగా, వ్యక్తిగతంగా వాడే ఫోన్లను ఎలాంటి కోర్టు తీర్పు లేకుండా, వాటితో నేరుగా ఆరోపణల సంబంధం లేనప్పుడు ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అంతేకాక, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం, ఐటీ చట్టం ప్రకారం, ప్రైవసీ హక్కులకు విఘాతం కలిగించేలా ఉంటుందని తెలిపారు. ఈ చట్టాల ప్రకారం కేవలం కోర్టు తీర్పు ఉన్నప్పుడు మాత్రమే విచారణ సంస్థలు మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్ లాంటి వ్యక్తిగత డివైసులు అడగవచ్చని వివరించారు. ఎలాంటి ప్రజాప్రయోజనం లేని సందర్భంలో విచారణ సంస్థలు ఇలాంటి ఆదేశాలు ఇవ్వలేవని పేర్కొన్నారు. ఎటువంటి నిధుల దుర్వినియోగం లేకుండా, స్కాం లేని పరిస్థితిలో ఈ కేసు పూర్తిగా రాజకీయ వేధింపుల కోణంలో జరుగుతోందని స్పష్టంగా పేర్కొన్నారు.

# గోదావరి మిగులు జలాలతో బనకచర్ల

## ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదు: రామానాయుడు

అమరావతి**జూన్17(జర్నలిస్ట్ వార్త):**

గోదావరి వరదల వల్ల ఎపికే ఎక్కువ నష్టం అని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పర్యావరణ అనుమతుల కోసమే కేంద్రానికి లేఖ రాశాం అని అన్నారు. ఈ సందర్భంగా నిమ్మల మీడియాతో మాట్లాడుతూ.. వరదల వల్ల నష్టపోతున్న ఎపికి.. నీళ్లు ఉపయోగించుకునే హక్కుఉందని చెప్పారు. గోదావరి నీళ్లు నిరుపయోగంగా సముద్రంలో కలుస్తున్నాయని, ఎగువ నీటి అవసరాలు తీరిన తర్వాతే బనకచర్లకు నీళ్లు వృథాగా పోతున్నాయని ఆ నీళ్లనే బనకచర్లకు వాడుకుంటాం అని తెలియజేశారు. రాజకీయ లబ్ది కోసమే బనకచర్లపై వైసిపి విమర్శలు చేస్తుందని మండిపడ్డారు. ప్రాజెక్టుతో ఎగువ రాష్ట్రాలకు నష్టం లేదని అన్నారు. బనకచర్లపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, ప్రాజెక్టుపై అనుమానాలు అవసరం లేదు అని నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈ ప్రాజెక్టుపై ఆయన సచివాలయంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఏటా గోదావరి నుంచి 3 వేల టీఎంసీలు వృథాగా సముద్రంలోకి పోతున్నాయని ఆయన వివరించారు. 'ప్రపంచంలోనే ఒక నదిలో ఒకే సమయంలో 50 లక్షల క్యూసెక్కులు ప్రవహించే నది గోదావరి. పోలవరం వద్ద లభ్యమయ్యే గోదావరి వరద జలాలను మాత్రమే ఉపయోగించుకుంటాం. వృథాగా సముద్రంలోకి పోయే నీటిని మాత్రమే బనకచర్లకు తరలిస్తాం. ఎక్కడా నికర జలాలను వాడట్లేదని స్పష్టంగా చెబుతున్నాం. ఎగువ రాష్ట్రాలకు కేటాయించిన నీటిని వాడుకునే పరిస్థితి లేదని ఆయన వెల్లడించారు. బనకచర్ల ప్రాజెక్టుపై వాస్తవాలు ప్రజలకు తెలియాలని, దీనిపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, గత 50 ఏళ్లుగా గోదావరి నీరు వృధాగా 3000 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోందని, ఇందులో 200 టీఎంసీల నీరు ఉపయోగించి బనకచర్లకు తరలించాలనే ఈ ప్రాజెక్ట్ నిర్మాణ ఉద్దేశమని ఏపీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మూడు సెగ్మెంట్‌లుగా బనకచర్ల నిర్మాణం జరుగుతుందని, పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు.. ప్రకాశం బ్యారేజీ నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్ వరకు.. సెగ్మెంట్ 2: బొల్లాపల్లి నుంచి బనకచర్ల వరకు.. సెగ్మెంట్ 3.. ఇలా మూడు సెగ్మెంట్‌లలో నిర్మాణం జరుగుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. బనకచర్లపై వస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయాల కోసమేనని, సాంకేతిక అంశాల కన్నా రాజకీయంపై దృష్టితోనే ఆరోపణలు చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. తెలంగాణలో అంతర్గత రాజకీయాలు కోసం బనకచర్లపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకు వెళుతోందని అసత్యాలు చెబుతున్నారని మండిపడ్డారు. అన్ని నియమ నిబంధనల ప్రకారమే అనుమతి తీసుకుని నిర్మాణం జరుగుతుందన్నారు. సీడబ్ల్యూసీకి ఇప్పటికే ప్రాథమిక నివేదిక ఇచ్చామని చెప్పారు. ఆమోదం లేకుండా డీపీఆర్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారని, ప్రాథమిక నివేదిక ఆమోదం తెలిపాక డీపీఆర్ ఇస్తామని మంత్రి తెలిపారు. పోలవరం, బనకచర్ల అనుమతులు నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని మరోసారి స్పష్టం చేశారు. ఏపీ జలదోపిడీ అని విమర్శలు చేస్తున్నారని, వరద జలాలు ఉపయోగించు కోవడం తమ హక్కు అని, దిగువ రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్ ఎగువ రాష్ట్రాల ప్రయోజనాలు... నీటి అవసరాలు తీరాక మాత్రమే వరద జలాలు ఉపయోగిస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఏ రాష్ట్రానికి ఎలాంటి నష్టం లేదని, ప్రతి ఏడాది 3వేల టీఎంసీల నీరు సముద్రంలోకి పోతోందన్నారు. ఒక ఏడాది 7 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వృధాగా పోయిందన్నారు. ఇంకా వర్షాకాలం పూర్తిగా రాకుండానే సముద్రంలోకి నీరు వృధాగా పోతోందని అన్నారు. కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టులకు సరైన అనుమతి తీసుకోలేదని ఆరోపించారు. పూర్తయిన ప్రాజెక్టులకే అనుమతి లేదని, ఇంకా ప్రారంభ దశలో ఉన్న ప్రాజెక్టుల అనుమతిపై మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రాజెక్టును ఆపాలన్న దురుద్దేశం తమకు లేదని... సీఎం చంద్రబాబుకు అసలే లేదని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. సీతారాం సాగర్ లిఫ్ట్‌కు కూడా మొన్ననే అనుమతి వచ్చిందని, కానీ 75 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. దేవాదుల ఎత్తి పోతల పథకంతో పాటు చాలా ప్రాజెక్టులకు చంద్రబాబు సహకరించారని, బీమా ఎత్తిపోతల పథకానికి కూడా సహకారం అందించారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎస్సార్ఎస్పీతో పాటు అనేక ప్రాజెక్టులకు చంద్రబాబు సహకరించారన్నారు. ఈ విషయాన్ని తెలంగాణా ప్రజలు గుర్తు పెట్టుకోవాలన్నారు. దిగువ రాష్ట్రాలకు ఉన్న హక్కుల ప్రకారం చంద్రబాబు కొన్ని ప్రాజెక్టుల విషయంలో అభిప్రాయం చెప్పారు తప్ప అడ్డుకోవాలని కాదని అన్నారు. అపెక్స్‌లో ఇరు రాష్ట్రాల సీఎంల మాటలు మినిట్స్ రూపంలో ఉన్నాయన్నారు. రెండు రాష్ట్రాలు ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉండాలని చంద్రబాబు చెప్పారని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు.

# నాలుగుచోట్ల ఆధునిక గోశాలలు

/హైదరాబాద్:**జూన్17(జర్నలిస్ట్ వార్త):**




రాష్ట్రంలోగో సం రక్షణకు సమగ్ర విధానం రూపొందించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లోని విధానాల అధ్యయనానికి ముగ్గురు అధికారులతో ఒక కమిటీని సిఎం నియమించారు. పశు సంవర్ధక శాఖ ప్ర త్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్య ర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రా వులతో కూడిన కమిటీ ఈ విషయంలో లోతైన అధ్యయనం చేయాలని సిఎం ఆదేశించారు. రా ష్ట్రంలో గో సంరక్షణపై సిఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం తన నివాసంలో సమీక్ష ని ర్వహించారు. మన సంస్కృతీలో గోవులకు ఉ న్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు గోవుల సంరక్షణే ప్రధానంగా విధానాల రూపకల్పన ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. భక్తులు గోశాలలకు పెద్ద సంఖ్యలో గోవులు దానం చేస్తున్నారని, స్థ లాభావం, ఇతర సమస్యలతో అవి తరచూ మృ త్యువాత పడుతున్నాయని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితులను అధిగమించి గోవుల సంరక్షణే ధ్యేయంగా తొలుత రాష్ట్రంలోని నా లుగు ప్రదేశాల్లో ఆధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సిఎం సూచించారు.

ప్రముఖ దేవస్థానాల ఆధ్వర్యంలో కోడె మొక్కులు చెల్లించే వే ములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశు సంవర్ధక శాఖ వి శ్వ విద్యాలయం సమీపంలో విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలని సిఎం సూచించారు. భక్తులు అత్యధిక భక్తిశ్రద్ధలతో సమర్పిం చే కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనపర్చాలని సిఎం సూచించారు. వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలని సిఎం తెలిపారు. గో సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి వ్యయానికైనా వెనుకాడదని సిఎం స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన అప్రోచ్ పేపర్‌ను అధికారులు సిఎంకు అందజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శులు వి. శేషాద్రి, శ్రీనివాసరాజు, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కిషన్‌రెడ్డీ జీ..నాకు అపాయింట్‌మెంట్ ఇవ్వండి: రాజాసింగ్

/హైదరాబాద్:**జూన్17(జర్నలిస్ట్ వార్త):**



ఏదో ఒక వివాదాస్పద ప్రకటన చేస్తూ వార్తల్లో నిలిచే గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆకస్మికంగా చేసిన ప్రకటన చర్చనీయాంశంగా మారింది. కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డితో వ్యక్తిగతంగా సమావేశమయ్యేందుకు తనకు అవకాశం ఇవ్వాలని, కొన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లాలని భావిస్తున్నట్లు రాజాసింగ్ మంగళవారం తెలిపారు. వ్యక్తిగతంగా కలిసేందుకు సమయం ఇవ్వాలని రాజాసింగ్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఎక్కడ, ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియజేస్తే, తానే అక్కడికే వచ్చి కలుస్తానని, అందుకు తనకు సమయం కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా రాజాసింగ్ సానుకూల ధృక్పధంతో మాట్లాడుతూ రాష్ట్రానికి, దేశానికి బీజేపీ అవసరమని అన్నారు. ఈ సమయంలో వ్యక్తిగత విషయాలు పక్కన బెట్టి పార్టీలో అంతా ఐక్యంగా కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. అందరూ సమష్టిగా పనిచేస్తేనే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దీంతో గత కొన్ని నెలలుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తదితరులపై పరోక్షంగా విమర్శలు గుప్పించి ఒక్కసారిగా కిషన్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ఎవరూ ఊహించని రీతిలో కోరడం ప్రస్తుతం ఆ పార్టీ నాయకుల్లో చర్చ సాగుతోంది. అయితే ఇలా మీడియా ద్వారా కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేయడంపై ఆయన ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

# ప్రజా ప్రభుత్వంలో సంక్షేమాన్ని
# వెనకబడనివ్వం..
# అభివృద్ధిని ఆగనివ్వం



- ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజలపై ఒక్క రూపాయి భారం మోపకుండా వేల కోట్లతో సంక్షేమ పథకాలు తీసుకువస్తున్నాం..
- రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురాబోతున్నం..
- రాష్ట్రానికి మేలు చేయాలన్న తలంపుతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం క్యాబినెట్ నిరంతరం కృషి చేస్తుంది..
- చెన్నాపూర్ లో సబ్ స్టేషన్ ప్రారంభోత్సవం, మంజూరునగర్, నవాబుపేట, ధర్మారావుపేట సబ్ స్టేషన్ల నిర్మాణ పనుల శంకుస్థాపన

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు..



**భూపాలపల్లి/జూన్17(జర్నలిస్టు వార్త:** ప్రజా ప్రభుత్వంలో సంక్షేమాన్ని వెనకబడనివ్వం.. అభివృద్ధిని ఆగనివ్వమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డీసీసీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా కొత్తపల్లిగోరి మండలం చెన్నాపూర్ గ్రామంలో నూతనంగా రూ. 140 లక్షలతో నిర్మించిన సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. అనంతరం మొరంచపల్లి నుండి మంజూరునగర్ వరకు వరకు సాగిన పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించగా, ఈ ర్యాలీలో అతిథులు ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం మంజూరునగర్లో నవాబుపేట, ధర్మారావుపేట, మంజూరునగర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క







మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజలపై ఒక్క రూపాయి భారం మోపకుండా వేల కోట్లతో సంక్షేమ పథకాలు తీసుకువస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురాబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి మేలు చేయాలన్న తలంపుతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం క్యాబినెట్ నిరంతరం కృషి చేస్తుందన్నారు.ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. రూ.22,500 కోట్లు ఖర్చు చేసి 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించబోతున్నామని తెలిపారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి, కనీసం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. మేం అధికారంలోకి రాగానే సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి గ్రూప్ వన్ పరీక్షను విజయవంతంగా నిర్వహించామున్నారు. ఏడాదిన్నర కాలంలో 57వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసాం, మరో 30 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయబోతున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు యువతను



ఆర్థికంగా ప్రోత్సహించేందుకు తొమ్మిది వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాన్ని తీసుకువచ్చామన్నారు. 5 లక్షల మంది నిరుద్యోగులు వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సహించేందుకు తొమ్మిది వేల కోట్ల నిధులు ఖర్చు చేయనున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీని మొదటి ఏడాదిలోనే చేసిందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతు రుణమాఫీ కోసం రూ. 21,500 కోట్లు ఖర్చు చేసామన్నారు. రూ.13 వేల కోట్లు ఖర్చు చేసి 90 లక్షల కుటుంబాలకు ఒక్కొక్కరికి ప్రతి నెల 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో సగభాగంగా ఉన్న మహిళలు రాష్ట్రంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి, గుడికి, లేదా పిల్లల బడికి వెళ్లేందుకు ప్రతి మహిళ ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం కల్పించిందన్నారు. పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలల్లో పెద్ద సంఖ్యలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హనుమకొండ/జూన్17(జర్నలిస్ట్ వార్త):** 3 నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలందరినీ తల్లిదండ్రులు దగ్గరలోని అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ హనంకొండ జిల్లా, జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి గారి అధ్యక్షతన 49వ డివిజన్ జులైవాడ అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన అమ్మ మాట -అంగన్వాడి బాట ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో అంగన్వాడి సెంటర్ కి పిల్లల్ని పంపించినట్లయితే వారిలో శారీరక పెరుగుదలతో పాటు మానసిక, సామాజిక, మేధో అభివృద్ధి కూడా జరుగుతుందన్నారు. అంగన్వాడీ టీచర్స్ అందరూ చిత్తశుద్ధితో న్యూ కరికులమ్ ప్రకారం ఫాలో అవుతూ పిల్లలని అంగన్వాడీ కేంద్రం పూర్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి మాట్లాడుతూ ఉదయం 9 గంటలకే అన్ని అంగన్వాడీ కేంద్రాలలో బెల్



మోగించి ప్రీస్కూల్ కార్యక్రమాలని న్యూ టైం టేబుల్, సిలబస్ ద్వారా నిర్వహిస్తూ ప్రీస్కూల్ నమోదు, హాజరు ను పెంచి, పిల్లలని సాయంత్రం నాలుగు గంటల వరకు అంగన్వాడీ సెంటర్లోనే ఉంచవలసిందిగా కోరారు. ఆరోగ్యలక్ష్మి ద్వారా అందించే ఒక పూట సంపూర్ణ భోజనాన్ని గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాలలోనే తినేలాగా సూచించారు. స్థానిక 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా అంగన్వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలని, ఒక గర్భిణీ గా ఉన్నప్పటి నుంచి అంగన్వాడి సెంటర్స్ లో నమోదు చేసుకొని, అంగన్వాడి సర్వీసెస్ అన్ని అందుకుంటూ పుట్టిన బిడ్డకి ఐదు సంవత్సరాల వయసు వచ్చేవరకు కూడా అంగన్వాడి సెంటర్ లో అంగన్వాడీ టీచర్ల చే సంరక్షించబడుతుందని తెలియజేశారు. అదేవిధంగా వారి కూతురైన ఆధ్యా పటేల్ మూడు సంవత్సరాలు పాపని కూడా అంగన్వాడి కేంద్రంలో జాయిన్ చేయడం జరిగింది. 30 మంది మూడు సంవత్సరాల నిండిన పిల్లలకి జిల్లా కలెక్టర్, 49వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ హనుమకొండ సిడిపిఓ ఎం విశ్వజ, సూపర్వైజర్స్ వి రాజలక్ష్మి , ఎం జ్యోతి, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ డి. ప్రీతి, డిహెచ్ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ డి కళ్యాణి అండ్ స్టాఫ్, సఖి అడ్మిన్ హైమావతి అండ్ స్టాఫ్, అంగన్వాడీ టీచర్లు ఎం ప్రసన్న, రమాతార , అంగన్వాడి హెల్పర్లు, ఏఎన్ఎంలు,ఆశా వర్కర్లు, అంగన్వాడి లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఇజ్రాయిల్ ఆక్రమించిన పాలస్తీనా భూభాగాల పై నుండి వెంటనే వైదొలగాలి

### ఇష్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి

**హనుమకొండ/జూన్17(జర్నలిస్ట్ వార్త):** ప్రపంచంలో సామ్రాజ్యవాదం వెనుకబడిన దేశాలను కబళించాలనే పన్నాగంలో భాగంగా ఇజ్రాయిల్ పాలస్తీనాను ఆక్రమించుకోవడానికి తీవ్రంగా యుద్ధ ప్రయత్నాలు చేయడం అంతర్జాతీయ యుద్ధం నేరమని, వెంటనే పాలస్తీనా ప్రాంతం నుంచి ఇజ్రాయిల్ సైన్యాలు ఆక్రమించిన భూభాగాలను




వదిలి వెళ్లాలని ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి నేదునూరి రాజమౌళి డిమాండ్ చేసినారు. మంగళవారం హనుమకొండలో అంబేద్కర్ సర్కిల్ నందు పాలస్తీనా సంఘీభావ దినంగా పాటిస్తూ ప్రదర్శన చేయడం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ న్యాయం, శాంతి, మానవత్వం ప్రపంచంలో వర్ధిల్లాలని ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోఆపరేషన్ అండ్ ఫ్రెండ్షిఫ్ ఇండియాలో పనిచేస్తుందని తెలిపారు. 20 నెలలుగా పాలస్తీనాలో 55 వేల మందిని ఇజ్రాయిల్ సైన్యం చంపడాన్ని తీవ్రంగా ఖండించారు. జాతుల సమస్య ప్రాంతాల సమస్య అణు యుద్ధాలకు దారి తీయకుండా చర్చల ద్వారా పరిష్కరింపబడాలని, అందుకు భారతదేశం ముందుకు రావాలని తెలిపారు. సంఘీభావ ఉద్యమాలు, శాంతి ఉద్యమాలు యుద్ధోన్మాదాన్ని నిరోధించగలవని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి మద్యలఎల్లేష్, శాంతి సంఘం నాయకులు తోట సుధాకర్,లనవ చేతన బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, ఎర్ర కుమారస్వామి, రాజు, వెంకటేష్, ప్రవీణ్ కుమార్, మోడెం రాజేందర్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణ ఫలాలు సద్వినియోగం చేసుకోవాలి

### - ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ

**ఆలేరు/జూన్17(జర్నలిస్ట్ వార్త):** వర్గీకరణ ఫలాలు సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ అన్నారు.తరతరాలుగా వివక్షతకు గురైన మాదిగలు ఇప్పుడిప్పుడే రాజ్యాంగ ఫలాలను ఎస్సీ వర్గీకరణ ద్వారా పొందుతున్నారని, ఇకపై సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా అన్ని రంగాల్లో ఎదగడానికి ముందకు నడవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ అన్నారు.మంగళవారం యాదగిరిగుట్ట మండలం యాదాద్రి పట్టణంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎమ్మార్పియస్ మండల ఇంచార్జీ బూడిద జానీ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ పాల్గొని వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలులో లేకపోవడం వల్ల విద్యా ఉద్యోగ సంక్షేమ



రాజకీయ రంగాల్లో మాదిగలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు.మాదిగల పక్షాన దండోరా ఉద్యమాన్ని ప్రారభించి ముప్పై ఏళ్లుగా రాజీలేని పోరాటాన్ని నడిపించి నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేయించిన ఘనత ఎమ్మార్పియస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ గారికే దక్కుతుందని అన్నారు.నేడు తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణలో 9% రిజర్వేషన్లు మాదిగలకు దక్కాయని అన్నారు.కావున మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులు 9శాతం రిజర్వేషన్లు అందిపుచ్చుకొని విద్యా, ఉద్యోగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు.ఎస్సీ వర్గీకరణ స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి సమాజంలోని అన్ని కులాల వారు తమ మద్దతును తెలిపి అండగా ఉన్నారని ఉన్నారు.కావున ఎమ్మార్పియస్ ఉద్యమానికి శ్రేయోభిలషులుగా ఉన్న వారి పట్ల కృతజ్ఞతగా ఉంటామని అన్నారు .అందులో భాగంగా జూలై 7 న ఎమ్మార్పియస్ 31 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని గ్రామాల్లో సభలు పెట్టి అన్ని కులాల వారికి కృతజ్ఞతలు తెలుపుతూ సత్కారం చేస్తామని అన్నారు.జూలై 7 న అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున ఎమ్మార్పియస్ జెండాలను ఆవిష్కరణ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ,ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పియస్ మండల ఇంచార్జీ ఎంఎస్పీ జిల్లా నాయకులు బూడిద జానీ మాదిగ, ఎమ్మార్పియస్ మండల అధ్యక్షులు ఆకారపు లక్ష్మీనారాయణ మాదిగ, నియోజకవర్గ నాయకులు జెర్రిపోతుల కరుణాకర్ మాదిగ, మండల అధికార ప్రతినిధి వద్దిగాళ్ల రాజు మాదిగ, సుంచు బాబు మాదిగ,సుంచు సిద్దు మాదిగ,జంగ మచెందర్ మాదిగ, బూడిద సాయి తేజ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే భూభారతి రెవెన్యూ సదస్సులు

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

### హసన్ పర్తి మండలం సూదన్ పల్లి లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు

**హనుమకొండ/జూన్17(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భారతి చట్టాన్ని అమలు చేస్తుందని, భూ సమస్యలున్నవారు భూభారతి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం సూదన్ పల్లి లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రెవెన్యూ అధికారులు



భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సులో పాల్గొన్న రైతులు, స్థానికులతో కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి భూ సమస్య ఉందని, కాస్తులో ఉన్నారా, సాదాబైనామాకు దరఖాస్తు చేశారా, భూములు అమ్మిన వారికి పాసుబుక్కులు ఉన్నాయా లేదా, భూములకు సంబంధించి ఎలాంటి ఆధారాలతో క్రయవిక్రయాలు చేశారు, తదితర భూ సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో భూ సమస్యను గురించి దరఖాస్తు చేసుకున్నట్లయితే, తహసీల్దార్ సంబంధిత సమస్యపై విచారణ సాగిస్తారని రైతులు, స్థానికులకు సూచించారు. రైతులు తమ భూ సమస్యను పేర్కొంటూ రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా స్థానికులు తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందుతాయని, ఇండ్ల కోసం దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ఎండి. రహీం పాషా, ఆర్ఐ ఫాజిల్, గృహనిర్మాణ శాఖ అధికారులు రవీందర్, సిద్ధార్థ నాయక్, ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, ఇతర అధికారులు, రైతులు,, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వం లక్ష్యం



**రాయపర్తి/జూన్17(జర్నలిస్ట్ వార్త):**భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి లక్ష్యం అని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మంగళవారం మండల కేంద్రంలో భూ భారతి రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.ప్రతి ఒక్కరు భూ భారతి రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చంద్రమోహన్, ఏఆర్ఐ సంధ్యారాణి,సర్వేయర్ వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వాహన దారులు సరైన పత్రాలు కలిగి ఉండాలి

**- ఎస్ఐ ముత్యం రాజేందర్**




**రాయపర్తి/జూన్17(జర్నలిస్ట్ వార్త):**వాహన దారులు సరైన పత్రాలు కలిగి ఉండాలని ఎస్ఐ ముత్యం రాజేందర్ అన్నారు.మంగళవారం మండల కేంద్రంలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించి,డ్రైవింగ్ లైసెన్స్,వాహన ఇన్స్యూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని అన్నారు.వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను చెల్లించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ గణేష్,అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ ను సన్మానించిన ఓబిసి సెల్ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి



**నర్సంపేట/జూన్17(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర బీసి సంక్షేమశాఖ,రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా ఓబీసి సెల్ చైర్మన్ ఓర్సు తిరుపతి శాలువాతో సన్మానం చేశారు. మంగళవారం పాపయ్య పేట కు వెళ్లి తిరిగి వెళ్లే క్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తో పలు అభివృద్ధి కార్యక్రమాల పై చర్చించారు.ఈ సందర్భంగా ఓర్సు తిరుపతి మంత్రి పొన్నం ప్రభాకర్ ను సన్మానించారు. అనంతరం ఓర్సు తిరుపతి మాట్లాడుతూ కుల గణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కృషి చేసినందుకు బీసీలందరూ కాంగ్రెస్ పార్టీ కి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా అద్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


దాచిన చిత్రం

**కల్లూరు/జూన్17(జర్నలిస్ట్ వార్త):** సోమవారం రాత్రి ఖమ్మం వైపు నుండి సత్తుపల్లి వైపుకు వెళుతున్న గూడ్స్ లారీ నెంబర్ **TG-12-T-2169** తో మోటార్ సైకిల్ నెంబర్ **AP-20-K-9229** ను ఢీ కొనగా మోటార్ సైకిల్ నడుపుతున్న బొడ్డు నరసింహారావుకు చిన్న దెబ్బలు తాకగా మోటార్ సైకిల్ వెనక కూర్చున్న ముత్యాల ఎల్లారావు వయసు 32 సంవత్సరాల వ్యక్తి తలపై కుడికాలు తొడపై చాతిపై తీవ్ర రక్త గాయాలు కాగా స్థానిక ప్రయివేట్ హాస్పటల్ నందు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం ఖమ్మం మమత హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఎల్లారావు మంగళవారం తెల్లవారుజామున రెండున్నర గంటల సమయంలో చనిపోయినాడు మృతుని తల్లి సమాచారం తెలిపారు. మృతుని తల్లి ముత్యాల రాంబాయి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా ఎస్సైడి. హరిత .

# గ్రామ కంఠం భూమిని కాపాడాలని వినతి



**పర్వతగిరి/జూన్17(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని డెవలప్ నగర్ గ్రామంలో ఉన్న గ్రామ కంఠం భూమిని కాపాడాలని పలువురు గ్రామస్తులు మంగళవారం భూభారతి రెవెన్యూ సదస్సులో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి ఆనుకొని ఉన్న 3.20 ఎకరాల గ్రామకంఠం భూమిని ఇతర గ్రామానికి చెందిన కొందరు పక్క సర్వే నెంబర్ వేసి ధరణి ద్వారా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం భూభారతి రెవెన్యూ చట్టం వచ్చినందున సదరు భూమిని సర్వే చేసి రిజిస్ట్రేషన్లు రద్దుచేసి గ్రామానికి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు దొనికి కొమురయ్య, బందెల వెంకన్న కత్తుల వెంకన్న ,కత్తుల శ్రీశైలం, బర్ల రాజశేఖర్, ఇట్టబోయిన రాజు, బర్ల స్వామి, వెల్తూరి వీరస్వామి, గాదరి ఏసు, .బర్ల హరీశ్, గాదరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం



**చెన్నారావుపేట/జూన్17(జర్నలిస్ట్ వార్త):** పేదింటి కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు వరం లాంటిదని,విడతల వారీగా అర్హులందరి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని మంగళవారం పాత మొగుద్దు%శీ%పురం కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికి సొంతింటి కల సహాకారం కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో పేదలకు ఇందిరమ్మ ఇండ్ల కల సహకారం అవ్వడం సంతోషంగా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో మరిన్ని ఇండ్లు మంజూరు అవుతాయని పాత ముద్దుపురం గ్రామ ప్రజలు ఎవరు అధైర్య పడ వద్దని విడతల వారీగా అర్హత ఉన్న వారికి ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు నను మాస వీరస్వామి, మాజీ ఉపసర్పంచ్లు బండారి సత్యం ననుమాస కరుణాకర్ గౌడ్, నాయకులు రంజిత్ కుమార్, గుర్రం బిక్షపతి, గ్రామ సిబ్బంది సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల ఆత్మగౌరవ జెండా పండుగను ఘనంగా నిర్వహించాలి

**-గోలి సుధాకర్ మాదిగ**



**పర్వతగిరి/జూన్17(జర్నలిస్ట్ వార్త):**మాదిగల ఆత్మగౌరవ జెండా పండుగను ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి పర్వతగిరి మండలం ఇంచార్జ్ గోలి సుధాకర్ మాదిగ అన్నారు. మంగళవారం ఏనుగల్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి పర్వతగిరి మండలం ఇంచార్జ్ గోలి సుధాకర్ మాదిగ హాజరై మాట్లాడుతూ జూలై 7వ తేదీన మాదిగలకు ఆత్మగౌరవం తీసుకొచ్చి ఈ దేశంలోనే తలెత్తుకునేలా చేసిన జెండా మాదిగల ఆత్మగౌరవ జెండా పండుగను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచారు.ఈ కార్యక్రమంలో మాసాని గోపాల్ మాదిగ ఎం ఎస్ పి వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి మాసాని రమేష్ మాదిగ మాసాని బిక్షపతి మాదిగ మాసాని యాకూబ్ మాదిగ భాస్కర్ మాదిగ దేవేందర్ మాదిగ ప్రణయ్ మాదిగ నరసయ్య మాదిగ సాయిలు మాదిగలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐ రాజేందర్ ను శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు




**రాయపర్తి/జూన్17(జర్నలిస్ట్ వార్త):** ఇటీవల మండల ఎస్ఐ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ ముత్యం రాజేందర్ ను మంగళవారం బిఆర్ఎస్ నాయకులు కేశవాపురం గ్రామ తాజా మాజీ సర్పంచ్ చిలుముల ఎలమ్మయాకయ్య మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు

# కరెంట్ షాక్ కు గురై దుక్కిటెద్దు మృతి



**రాయపర్తి/జూన్17(జర్నలిస్ట్ వార్త):**కరెంట్ షాక్ తో ఓ దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని తిర్మలాయపల్లి లో మంగళవారం చోటుచేసుకుంది.గ్రామస్తుల కథనం ప్రకారం దొంతరబోయిన రాజయ్య అనే రైతుకు చెందిన దుక్కిటెద్దు మేతమేస్తున్న క్రమంలో విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.దీని విలువ సుమారు 90 వేల రూపాయలు ఉంటుందని రైతు రాజయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

# గ్రామ గ్రామాన ఎం ఆర్ పి ఎస్ గద్దె నిర్మాణం చెయ్యాలి

**ఖమ్మం జిల్లా ఎమ్మార్పీఎస్ ఇంచార్జి కందిక విజయ్ మాదిగ**





**వేంసూరు/జూన్17(జర్నలిస్ట్ వార్త):** గ్రామ గ్రామాన ఎం ఆర్ పి ఎస్ గద్దె నిర్మాణం చెయ్యాలని ఖమ్మం జిల్లా ఎమ్మార్పీఎస్ ఇంచార్జి కందిక విజయ్ మాదిగ అన్నారు.వేంసూరు ఎమ్మెస్పి ఎమ్మార్పీఎస్ మండల సమీక్ష సమావేశం మంగళవారం ఏర్పాటు చెయ్యగా ముఖ్య అతిధిగా ఖమ్మం జిల్లా ఇంచార్జి కందిక విజయ్ మాదిగ హాజరై మాట్లాడుతూ ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన జెండా దిమ్మె స్థలం ఏర్పాటు చేయడం కోసం స్థలం గుర్తించడం జరిగిందన్నారు. మందకృష్ణ మాదిగ ఉద్యమ ఫలితమే ఏబిసిడి వర్గీకరణ సాధించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలోని ప్రతి మండల నియోజకవర్గ కేంద్రాల్లో గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా గద్దలు ఏర్పాటు చేయాలనిపించారు. నూతన జండగదే నిర్మాణ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెస్ ఎఫ్ మండల అధ్యక్షులు చిన్ని రత్నం కుమార్. గౌరవ అధ్యక్షులుగా బాలస్వామి మాదిగ, జిల్లా నాయకులు కలపోల యేసు మాదిగ, కనకపుడి రవి, వెంసూర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు కంచర్ల కొండలరావు, ఎమ్మార్పీఎస్ కల్లూరు గూడెం అధ్యక్షులు కోట మహేష్, రాయడపాలెం గ్రామ శాఖ అధ్యక్షులు ఖమ్మం పార్టీ వేణు మాదిగ, ఎం ఎస్ ఎఫ్ కోట వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు శ్రీనివాస్ మాదిగ,లు ఉన్నారు.ఈ కార్యక్రమంలో మాదిగ నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్తారావు మాదిగ మండల గ్రామ ముఖ్య నాయకత్వం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగ్ ల పంపిణీ




సత్తుపల్లి/జూన్17(జర్నలిస్ట్ వార్త):
కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, చదువు ఒక్కటే కాకుండా క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని ఓ సేవా ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ కొనకళ్ళ సుధారాణి అన్నారు. సత్తుపల్లి మండలం లోని కొమ్మగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం 41 మంది విద్యారులకు స్కూల్ బ్యాగ్ లును సుధారాణి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బడి ఈడు పిల్లలు అందర్నీ తల్లి తండ్రులు పాఠశాలకు పంపించాలని సూచించారు.

# కంచ ఐలయ్య కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి పొన్నం







**చెన్నారావుపేట/జూన్17(జర్నలిస్ట్ వార్త):** సైన్స్ మ్యాన్ కంచ కట్టయ్యకు మంగళవారం ఘన నివాళులు అర్పించడానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కంచ కట్టయ్యకు నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రభుత్వ ఎక్స్పర్ట్ కామిటీ వైస్ చైర్మన్ కంచ ఐలయ్య కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కంచ కట్టయ్య జీవితం చాలా గొప్పదని గుండెకు సర్జరీ అయిన తర్వాత46 సంవత్సరాలు ఒక స్టీల్ వాల్వ్ తోని జీవించారంటే సైన్స్ చరిత్రలోనే గొప్ప విప్లవమని చెప్పారు.ప్రజలందరూ మూఢనమ్మకాలను వీడనాడి కంచ కటయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాటి నెహ్రూ నుండి రాహుల్ వరకు ప్రజలను సైన్స్ గురించి తెలియజేస్తూ వారిని చైతన్య పరుస్తున్నారని వైద్యరంగంలో ఎన్నో విప్లవమైన మార్పులు తీసుకొచ్చిన ఘనత ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీదే అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున కంచకట్టయ్య కి ఘన నివాళులు అర్పిస్తున్నట్టు తెలియజేశారు.ఈ కార్యక్రమ%శీ%లో పిసిసి వర్కింగ్ చైర్మన్ ఓబీసీ వీరన్న యాదవ్, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ సభ్యులు సుభాష్ మంత్రి,కాంపాటి వీరయ్య,ఓయూ జే ఏ సి నాయకులు కొంగళ పాండు కురువ,కురుమసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నడి రమేష్ ,వెంకట్ నాయక్,మేకల శివతోపాటు వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు

# జిల్లా కలెక్టర్ గా ముజమ్మిల్ ఖాన్ తనదైన ప్రత్యేకతను చాటారు

**-తుంబూరు దయాకర్ రెడ్డి**

**ఖమ్మంబ్యూరో/జూన్17(జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా కలెక్టర్ గా సుమారు ఏడాది కాలం పాటు విధులు నిర్వర్తించిన ముజమ్మిల్ ఖాన్ పాలనలో తనదైన ప్రత్యేకతను చాటుకున్నారని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం బదిలీపై వెళ్తున్న ముజమ్మిల్ ఖాన్ ను ఖమ్మంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో దయాకర్ రెడ్డి కలిసి ఆయన సేవలను కొనియాడుతూ బొకే ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి బదిలీ అయ్యేంత వరకు నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.



# పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నీ సందర్శించిన కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్



**వెంసూర్/జూన్17(జర్నలిస్ట్ వార్త):** వేంసూరు మండలం-కల్లూరుగూడెం గ్రామంలో ఇటీవల శంకుస్థాపన జరిగిన ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీ పనులను మంగళవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం వలన ఈ ప్రాంత రైతుల కల సాకారం ఔతుందన్నారు. ఈ పరిసర ప్రాంతాల మొత్తం అభివృద్ధి బాటలో నడుస్తుంది అని స్థానిక యువత కి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధిఅవకాశాలు కలుగుతాయని గుర్తు చేశారు. పరిసర ప్రాంతాల పామ్ ఆయిల్ రైతులకు దగ్గరగా ఫ్యాక్టరీ ఉండడం వలన రవాణా ఖర్చులు తగ్గుతాయని, సకాలంలో పామ్ ఆయిల్ గెలలు ఫ్యాక్టరీ కి రవాణా చేసే అవకాసం ఉందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం అని అన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణం కు సంబంధించి సంబంధిత అధికారులకు పలు సూచనలు సలహాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పుచ్చకాయల సోమిరెడ్డి,వేంసూరు మండలం కాంగ్రెస్ నాయుకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# తల్లాడ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరాజు







**తల్లాడ/జూన్17(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా సరి కొండ శ్రీనివాసరాజు నియామకం జరిగినట్లు మంగళవారం సత్తుపల్లి నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కేతినేని హరీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లాడ మండల కేంద్రంలో కేతినేని థియేటర్ ఆవరణంలో కార్యకర్తల సమావేశం నిర్వహించగా అన్ని గ్రామ కమిటీలు ఆమోదం తెలుసుకొని మండల కమిటీ ఎన్నిక జరిగిందన్నారు.తల్లాడ పట్టణ టీడీపీ నూతన కమిటీ మండల ఉపాధ్యక్షులు రావూరి రవి ప్రసాద్ , ఉపాధ్యక్షుడుమోకర దోనేష్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. టిడిపి కార్యదర్శిగా వడ్డీల నాగేశ్వరరావు ,తల్లాడ టిడిపి మొక్క కృష్ణార్జున్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శిగా పరుచూరి. క్రిష్ణ, ను నియమించడంజరిగిందాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల తెలుగు యువత శీలం నర్సిరెడ్డి కూచి పూడి. వెంకటేశ్వరరావు, ధూపాటి భద్రరాజు, రావూరి రవి ప్రసాద్, రామారావు, పోతురాజు కృష్ణ, ప్రసాద్, వెంకటి, నార పోగు ప్రసాద్, ఎస్ కే బాబు, చల్ల నాగయ్య, మొక్క కృష్ణార్జున, దుగ్గినేని వెంకటేశ్వర్లు, కొమ్మినేని సత్యనారాయణ, , టెంట్ హౌస్ సురేష్ బాబు, కొమ్మినేని రాము, నీలం ప్రభాకర్, దొనేష్, చల్లా. వెంకన్న, వజీర్, వెంకటేశ్వరావు మండల అధ్యక్షులు టౌన్ అధ్యక్షులు ఎన్నుకోవడం జరిగిందన్నారు.

# తెలంగాణా లో తెలుగుదేశం పార్టీ బలపడుతుంది

**కల్లూరు/జూన్17(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణా లో తెలుగుదేశం పార్టీ బలపడుతుందని తెలుగుదేశం పార్టీ జిల్లా హడక్ కమిటీ సభ్యుడు జాస్తి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మండలంలో టీడిపి నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జిల్లా హడక్ కమిటీ సభ్యుడు జాస్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టీడిపి పార్టీ బలపడుతుందని బి ఆర్ ఎస్ పార్టీ ఓటమికి టీ డి పి ప్రధాన కారణమని తెలిపారు.. బిఆర్ యస్ నాయకులు టీడిపి పార్టీ ఎదుగుదలను ఓర్వలేక దుష్ప్రచారం చేస్తుందన్నారు. నీరు నియామకాల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ



అన్యాయం చేస్తూ ఆంధ్రాకి తరలిస్తున్నారని బి ఆర్ యస్ నాయకులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని హరీష్ రావు చేస్తున్న దుష్ప్రచారం మానాలని హెచ్చరించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో టీడీపీ కూటమి తరుపున అభ్యర్థులని పెట్టి గెలిపించుకుంటామని టిడిపీ పార్టీకి పూర్వ వైభవం తెలంగాణ రాష్ట్రంలో తీసుకొస్తామని తెలిపారు.బి ఆర్ యస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకోము అని రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు.రాబోయే రోజుల్లో బి ఆర్ యస్ నాయకులు అందరు టీడీపీ పార్టీలో చేరతారని బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో బస్తాపీతం చేస్తామని సవాలు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తో పొత్తు పెట్టుకోవటం వలనే బిఆర్ యస్ అధికారం కోల్పోయినదని అక్కసుతో టీడీపీ పార్టీని తెలంగాణ రాష్ట్రంలో లేకుండా చేసేందుకే దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జాస్తి శ్రీనివాసరావు,కాకర్ల, రంగారావు,పోట్రూ శ్రీనివాస రావు, జినుగు విజయిదాసు,కట్టా గోపాలరావు, దాసరి వెంకటేస్వరరావు,దూపకుంట్ల మురళి పాల్గొన్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర




**కల్లూరు/జూన్17(జర్నలిస్ట్ వార్త):** మండల పరిధి గ్రామానికి చెందిన రఘునాథ గూడెం జానపాటి. విజయరావు రాధమ్మల కుమారుడు చిరంజీవి సాయిబాబు చిరంజీవి మనీషా జానపాటి రామారావు శారద దంపతుల కుమార్తె చిరంజీవి అనూష చిరంజీవి భరత్ అదే గ్రామానికి చెందిన కొమ్ము విజయభాస్కర్ పద్మా దంపతుల కుమార్తె చిరంజీవి ప్రజ్ఞ చిరంజీవి వికోలాస్ రఘునాథ బంజరకు చెందిన బండి వెంకయ్య కుమారుడు చిరంజీవి గోపాల స్వామి చిరంజీవి స్వాతి ల నూతన దంపతులైన వారిని వారి గృహాలకు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వెళ్లి అట్టి నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మండల బి.ఆర్.యస్ పార్టీ యూత్ అధ్యక్షులు ప్రముఖ ప్రతాప్ ల్యాబ్ అధినేత పెదకంటి రామకృష్ణ కల్లూరు మాజీ జెడ్పిటిసి సభ్యులు లక్కినేని రఘు, మేకల కృష్ణ, కల్లూరు వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు, కావేటి నరసయ్య మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొరకొప్పు ప్రసాద్, మాజీ సర్పంచులు అంజన్ రావు, గొల్లమండల ప్రసాద్, నందిగం ప్రసాద్, మండల సోషల్ మీడియా అధ్యక్షులు సిహెచ్ కిరణ్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ చల్లగుండ్ల వెంకటేశ్వరావు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు బండి వెంకటి, కే లక్ష్మణరావు, బలుసు పాటి జగ్గయ్య, కళ్యాణ కిషోర్, జానపాటి రామారావు, పెద్ద వీరయ్య, పోనుగు మాటి శ్రీను, మోర్తాల పిచ్చిరెడ్డి, బానోతు. లక్ష్మణ్, జానపాటి అప్పారావు, సలీం, ఇర్ఫాన్, సాయి, రోజు వేణు, మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాలలో స్కూల్ బ్యాగులు, విద్యార్థుల డైరీ ల వితరణ

**పర్వతగిరి/జూన్17(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని సోమారం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు భరత్ కుమార్ చే స్కూల్ బ్యాగులు, విద్యార్థులకు డైరీలు బహుకరణ చేశారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి గాయపు లింగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జడ్.పీ.హెచ్.ఎస్.కొంకపాక కాంప్లెక్స్ ప్రదానోపాధ్యాయులు భిక్షపతి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, అంగన్వాడీలు,గ్రామస్తులు పాల్గొన్నారు.



# రేవంత్ రెడ్డి 17 నెలల పాలన అట్టర్ ఫ్లాప్

**తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ రాజయ్య**

**ధర్మసాగర్/జూన్17(జర్నలిస్ట్ వార్త):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 17 నెలల పాలన అత్తా ఓ క్లాక్ అయిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య అన్నారు ధర్మసాగర్ మండల కేంద్రంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కసారి కూడా జై తెలంగాణ అనని సీఎం రాష్ట్రానికి చేసింది శూన్యం ?420 హామీలు ఆరు గ్యారంటీలు హుష్ కాక అయిపోయాయి.హామీలు నెరవేరుస్తానని తేదీలు పెట్టిండు దేవుళ్ళ మీద ఒట్లు పెట్టిండు ఆ దేవుళ్ళకు కోపం వచ్చింది, రేవంత్ రెడ్డి ఏది ముట్టుకున్నా అది అట్టర్ ఫ్లాప్ అయిపోతుంది అన్నారు

హైడ్రా అరాచకంతో 3000 కోట్ల ఆస్తి నష్టాన్ని కలిగించి రియల్ ఎస్టేట్ పడిపోయేలా చేశారు, లగచర్ల రైతులపై నిరంకశపాలన చేసి తీవ్ర ఇబ్బందులు పెట్టారు..ఎస్ఎల్బీసీ ద్వారా 8 మందిని పొట్టన పెట్టుకొని ఇప్పటికీ శవాలు దొరకడం లేదు,భారీ వర్షాలకు ఖమ్మంలోని పెద్ద వాగు కొట్టుకుపోయింది దాన్ని బాగు చేసే పరిస్థితులు లేదు,ప్రాజెక్టులను గాలికి వదిలేశారని అన్నారు ఇంటి ఇల్లాలకి 2500 అన్నాడు అది దిక్కు లేదు కాలేజీ బిడ్డకు స్కూటీ కాకులు ఎత్తుకుపోయాయి.. ఆసరా పెన్షన్ 2000 నుంచి



4000 చేస్తా అన్నాడు వారి ఆశలను అడియాశలు చేశారు ...వికలాంగులకు 6000 అన్నాడు ఇచ్చిన మాట తప్పడు...నిరుద్యోగ భృతి 4 వేలు అన్నాడు సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాలన్నాడు,యువతను మోసం చేస్తున్నారని అన్నారు రేవంత్ రెడ్డి పట్టపగలు 50 లక్షలు బ్యాగుతో రెడ్ హ్యాండెడ్ గా దొరికి నెల రోజులు జైల్లో ఉన్నందుకు ప్రతీకారంగా కేసిఆర్ గారిని గాని కేటీఆర్ గారిని గాని హరీష్ రావు గారిని గాని జైల్లో పెట్టాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు....అందుకే ఇప్పటివరకు ప్రశ్నించే గొంతు కేటీఆర్ గారి పై 17 నెలల కాలంలో 14 అక్రమ కేసులు పెట్టాడు,కాళేశ్వరం కమిషన్ పేరుతో మొన్ననే కెసిఆర్ గారిని హరీష్ రావు గారిని విచారించడం జరిగిందన్నారు ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గాని నాయకత్వం కానీ నీకు భయపడేది లేదని అన్నారు .స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కడియం శ్రీహరి తీరు ఇంకోలా ఉంది....ఇక్కడ కాంగ్రెస్ వారిని తొక్కేస్తూ తనతో వచ్చిన అనుచరులకు ప్రాధాన్యత కల్పించడం వల్ల మొదటి నుండి కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరూ ఆయనకు వ్యతిరేకంగా ఆయనపైనే కంప్లైంట్ ఇవ్వడం జరిగిందని అన్నారు ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కడియం శ్రీహరి అనుసరులు డబ్బులు వసూలు చేసి ఇల్లు ఉన్న వారికే మళ్ళీ ఇల్లు ఇచ్చే పనులు జరుగుతున్నాయి ,స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గంలో కడియం శ్రీహరి అనుచరుల భూకబ్జాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి మొన్ననే శివునిపల్లిలో ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసి ఇతరులకు అమ్మే కార్యక్రమం కూడా జరిగిందన్నారు అధికారులు కడియం శ్రీహరికి ఆయన అనుచరులకు భయపడి నోరు మెదపకుండా ఉంటున్నారు,కచ్చితంగా ప్రభుత్వ భూములపై బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుంది...అధికారులను కూడా మేము హెచ్చరిస్తున్నాం మీరు ప్రభుత్వ భూములను కాపాడే విషయంలో చర్యలు తీసుకోకపోతే కచ్చితంగా మేము వాటిపై పోరాడి మీపై చర్యలు తీసుకునే వరకు కూడా పోరాడుతామని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధపడాలి...

కాంగ్రెస్ ప్రభుత్వం 17 నెలలుగా ఏ గ్రామానికి చేసింది ఏమీ లేదు... గత పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి పల్లెను ఎంతో అభివృద్ధి చేసింది..కాబట్టి గ్రామ గ్రామానికి వెళ్లి ఓట్లు అడిగే హక్కు కేవలం బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఉందని

ప్రతి ఒక్కరూ ప్రజల్లోకి వెళ్లి గొప్పగా పని చేసి రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో గులాబీ జెండా ఎగరెలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బొడ్డు ప్రభుదాస్ కర్ర సోమిరెడ్డి బేరమధుకర్ మాచర్ల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు